

# సూర్య

నేటి దినపత్రిక
www.suryaa.com
19వ వసంతంలోకి ...

ఏలూరు జిల్లా
పశ్చిమ గోదావరి జిల్లా

బుధవారం,18 మార్చి 2026 | 8 పేజీలు


## గృహ వినియోగదారులకు
# గ్యాస్ కొరత లేదు

- జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ
- జిల్లాలో టెంపుల్ టూరిజం సర్క్యూట్ - ఏలూరు కార్పొరేషన్‌కు 50 మంది సిబ్బంది
- పీడీఎస్ రైస్ బ్లాక్ మార్కెట్ చేసే వారిపై కేసులు : మంత్రి నాదెండ్ల



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాను అన్ని రంగాలలోనూ అభివృద్ధి బాటలో నిలిపేందుకు ప్రజాప్రతినిధులందరూ కలిసికట్టుగా ఒకఖచ్చితమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళతామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ,జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాలోని ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, అధికారులతో జిల్లా అభివృద్ధికి తీసుకోవలసిన అంశాలపై సమీక్షించిన అనంతరం పాత్రికేయుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ జిల్లా పరిస్థితులకు అనుకూలమైన ఉద్యానవన పంటలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వాటి అభివృద్ధి ద్వారా రాష్ట్రంలో జిల్లాను అభివృద్ధిలో 5నుండి 3వస్థానంలో నిలిపామన్నారు జిల్లాలో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత మేలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా అభివృద్ధిపై సమీక్షించనున్న దృష్ట్యా ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల సంతృప్తి స్థాయిని మరింత పెంచేందుకు, ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించడం జరిగిందన్నారు.వేసవిలో త్రాగునీటి కొరతలేకుండా తీసుకోవలసిన చర్యలు, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్లు, పంచాయతీ రోడ్లు,ఆర్అండ్‌బి రోడ్లు, ఆర్టీసీ బస్టాండ్లు,అన్న కేంటీన్లనిర్వహణ,పెన్షన్‌నమోదు, పాఠశాలలు,వసతి గృహాలలో మెరుగైన వసతుల కల్పన తదితర అంశాలపై

- తరువాయి 2లో..

## నేడు 'దివ్యాంగ శక్తి' ఉచిత బస్సు పథకం ప్రారంభం



**భీమవరం, మేజర్‌న్యూస్ :** 18వ తేదిబుధవారం దివ్యాంగ శక్తి పథకం ద్వారా దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభంలి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న "దివ్యాంగ శక్తి" పథకం ద్వారా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని మార్చి 18న ప్రారంభించనున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లాకలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు.స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆర్డీవోలు,నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌లతో "దివ్యాంగ శక్తి" కార్యక్రమ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని "దివ్యాంగ శక్తి" పథకాన్ని ప్రారంభిస్తున్నదని, ఈ పథకం ద్వారా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ఒక ముఖ్యమైన ముందడుగని పేర్కొన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో ఈ కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించేందుకు సంబంధిత అధికారులు చురుకుగా వ్యవహరించాలని సూచించారు.జిల్లాప్రధానకేంద్రంలో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా రెండు బస్సుల్లో

- తరువాయి 2లో..

## ఏసీబీకి చిక్కిన మున్సిపల్ సర్వేయర్ రౌతు రామకృష్ణ



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్;** తాడేపల్లిగూడెం మున్సిపల్ సర్వేయర్ రౌతు రామకృష్ణ నివాసంలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఒకస్థలం సర్వే రిపోర్టుకు యజమాని వద్ద సర్వేయర్ రామకృష్ణ రూ.50 వేలు నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.గతకొంత కాలంగా తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో జరుగుతున్న అవినీతిపై పలు కథనాలు వెలున బడినప్పటికిని అధికారులు మిన్నకున్నారు. కానీ ఏసీబీ అధికారులను ఒక స్థలం విషయంలో రామకృష్ణ 50వేలు డిమాండ్ చేస్తున్నాడని సమాచారం ఇవ్వడంతో రామకృష్ణ ఉన్న తన ఇంటివద్ద ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సర్వేయర్,సర్వే సిబ్బంది, కుటుంబ సభ్యులను ఏసీబీ

- తరువాయి 2లో..

## కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై
# వైసీపీ గర్జన

- అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి నిరసన తెలిపిన నేతలు

**ఏలూరు,మేజర్‌న్యూస్ :**కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అరాచకాలను నిరసిస్తూ, తిరుమల పవిత్రతను కాపాడటంలో విఫలమైన టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడును వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఏలూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు.నగరంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహంవద్ద పార్టీ శ్రేణులు ప్రభుత్వ తీరుపై నిప్పులుచెరిగారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏలూరు జిల్లాఅధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గ ఇంచార్జ్ మామిళ్ళపల్లి జయప్రకాష్ చింతలపూడి ఇంచార్జ్ కంభం విజయరాజు,పోలవరం ఇంచార్జ్ తెల్లం బాలరాజు పాల్గొని ప్రసంగించారు. హిందువుల అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి



దేవస్థానం ప్రతిష్ఠను కూటమి ప్రభుత్వం మంట గలుపుతోందని మండిపడ్డారు.

- తరువాయి 2లో..

## నేడు సత్యనారాయణపురంలో దివ్యాంగుల ఉచిత బస్సు పథకం ప్రారంభం



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు జిల్లాలో దివ్యంగులకు ఉచిత బస్సు ప్రయాణం 'దివ్యాంగ శక్తి ' పథకాన్ని ఈనెల 18వ తేదీ ఉదయం 11. 30 ని.లకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి భీమడోలు మండలం సత్యనారాయణపురం గ్రామంలో ప్రారంభిస్తారు అనంతరం సత్యనారాయణ పురం నుండి ఏలూరు వరకు వారితో కలిసి ప్రయాణిస్తారు.అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని దివ్యాంగులను వారి సమస్యలను గురించి అడిగి తెలుసుకుంటారు.

## చెరువు పూడికతీత పనులు వేగవంతం చేయండి



**ఉండి,మేజర్ న్యూస్:** గ్రామంలోని మంచినీటి చెరువులో యంత్రాల ద్వారా చేపట్టిన పూడికతీత పనులను వేగవంతం చేసి చెరువులో నీరు నింపి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఉండి మండల తహసీల్దార్ కావడి నాగార్జున, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఉండి మండలం మహదేవపట్నం గ్రామంలోని మంచినీటి చెరువులో యంత్రాల ద్వారా చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించిన వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాల కాలంగా మంచినీటి చెరువును పూడికతీత చేయకుండా వదిలేయడంతో చెరువు పూడుకుపోయి వేసవిలో నీటి ఎద్దడి వచ్చేదని అంతేకాకుండా నీరు ఫిల్టర్ అయినప్పటికీ మట్టి వాసన వస్తుందని ఆరోపణల నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ఆదేశాల మేరకు చెరువులో యంత్రాల ద్వారా పూడికతీత పనులను చేయడం జరుగుతుందని త్వరలోనే చెరువు పూడికతీత పనులు పూర్తి చేసుకుని నీటిని చెరువులో నిల్వ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జేవిటి నాయుడు, గ్రామ రెవెన్యూ అధికారి ఎస్ చిన్నారావు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న వడ్డి రఘురామ్‌లి



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్;** రంజాన్ మాసం పురస్కరించుకుని తాడేపల్లిగూడెం పట్టణంలోని పెద్దమసీదులో నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్డి రఘురామ్ నాయుడు ఇఫ్తార్ విందు అందచేశారు. ముస్లిం సోదరులతో కలసి నమాజ్ చేసి ఇఫ్తార్ విందు చేసారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ నెల రోజులపాటు ఉపవాసాలు, ప్రార్థనలు, దానధర్మాలతో, నియమనిష్ఠలతో జరుపుకుంటారని అన్నారు. మతసామరస్యాన్ని ఐక్యతను పెంపొదించి పరమావధిగా సాగే పవిత్ర మాసం రంజాన్ అని అన్నారు. రంజాన్ పండుగ సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీకగా అభివర్ణించారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ నాయకులు మహ్మద్ రఫీ, నౌషద్ మోహిద్దీన్, షేక్ సుభానీ, కొప్పుల వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, వైసీపీ నాయకులూ గుండుబోగుల నాగు, గుండుమోగుల బలుసులు, మాకరాజు సతీష్, మానుకొండ వెంకటేశ్వరరావు, కాకర్ల శ్రీనివాస్, రాజా త్రినాధ్, నీలం నాగభూషణం, వీర్ల గోవింద్, కలిశెట్టి తాతారావు, అశోక్, కిరణ్ రెడ్డి, అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు సేవా రంగంలో కూడా రాణించాలి : ఏఎస్పి సుస్మిత



జంగారెడ్డి గూడెం,మేజర్ న్యూస్: జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో మెట్ట ప్రాంత కాపు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు హర్షించాదగ్గ విషయం అని ఏఎస్పి సుస్మిత రామనాథన్ అన్నారు. పట్టణంలోని మెట్ట ప్రాంత కాపు మహిళా సేవ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఏ ఎస్ పి సుస్మిత మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెను శాలువా,పూల మొక్క అందజేసి సత్కరించారు. గతంలో మెట్ట ప్రాంత కాపు మహిళ సేవ సమాఖ్య చేసేనా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను గురించి ఏఎస్పి సుస్మితకు జెట్టి శైలజారని వివరించారు. ఈ సందర్భంగా ఏఎస్పి మాట్లాడుతూ వేసవికాలంలో ప్రయాణికులకు బాటసారులకు ఇటువంటి చలి వేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మహిళలు సేవారంగంలో కూడా రాణించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎ.సులోచనా రాణి,సుజాత,రమ్య,సీత,పద్మజ, నిర్మల, కుమారి, వరలక్ష్మి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## 22ఎ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



ఏలూరు,మేజర్ న్యూస్ : కైకలూరు నియోజకవర్గంలో 22ఏ భూ సమస్యలపై సర్వే నంబర్ల వారీగా ప‌రిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్‌కు తెలిపారు. జిల్లాలో 22 ఏ భూ సమస్యల పరిష్కారాలపై మంగళవారం భూపరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి.జయలక్ష్మి తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో 22ఏ భూ సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో సర్వే నెంబర్ల వారీగా పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన సమయంలో కైకలూరు నియోజకవర్గం ఉమ్మడి కృష్ణా జిల్లా నుండి ఏలూరు జిల్లాలో చేరిందన్నారు .కైకలూరు నియోజకవర్గంలోని ముదినేపల్లి,మండవల్లి మండలాల్లో 22ఏ భూ సమస్యలకు సంబంధించి ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సిఎస్ కి తెలియజేసారు. జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసిన జేసి రాహుల్ కుమార్ రెడ్డి



**పాలకొల్లు, మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఎల్.ఆర్.పేట పరిధిలో స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్‌సెటి బ్యాచ్-2 శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు సర్టిఫికేట్ల పంపిణీ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం పాలకొల్లు పట్టణంలోని వీవర్స్ కాలనీ వద్ద ఉన్న ఇండియన్ గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసి,అక్కడి ప్రజలతో మమేకమై ఎలాంటి సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి డైవర్షన్ జరగకుండా ఉండేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. పాలకొల్లు బస్ స్టాండ్ సమీపంలోని శరవణ హోటల్‌లో తనిఖీలు నిర్వహించి, గ్యాస్ సిలిండర్ల వినియోగంపై పరిశీలించారు. వ్యాపారులు గ్యాస్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో తెలుసుకుని వివరాలు సేకరించారు. ఈ తనిఖీల్లో పాలకొల్లు తహసిల్దార్ ఎడ్ల దుర్గా కిషోర్, సి ఎస్ డి టి, నాగదేవి, వీఆర్వో సిహెచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేదు

మొదటిపేజి తరువాయి

అధికారులతో చర్చించామన్నారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు 'టెంపుల్ టూరిజం సర్క్యూట్'ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. పాపికొండల ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధి, ఐ.ఎస్.జగన్నాథపురంలోని లక్ష్మి నరసింహస్వామికి వెళ్లే రహదారిని 2 లైన్ల నుండి 4 లైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఏలూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందేలా వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్‌తో చర్చించామన్నారు. రాష్ట్రంలో గృహ వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరాకు ఎటువంటి కొరతా లేదని, ప్రజలు ఆందోళనతో అవసరానికి మించి గ్యాస్ బుక్ చేసుకుంటున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రాష్ట్రంలో సగటున 2.8 లక్షల వంట గ్యాస్ బుకింగ్లు నమోదైతే, ప్రస్తుతం 3లక్షల వరకు బుకింగ్లు జరుగుతున్నాయన్నారు. ఏలూరు జిల్లాలో సగటున 12వేలనుండి 14 వేల వంట గ్యాస్ బుకింగ్లు ఉంటె, 50 వేల వరకు గ్యాస్ బుకింగ్ నమోదయ్యాయన్నారు. ఈనెల 20వ తేదీన విశాఖపట్టణం నకు పోర్ట్ నకు వంట గ్యాస్ నౌక చేరుకుంటున్నదన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై పాత్రికేయులు అడిగిన ప్రశ్నపై మంత్రి స్పందిస్తూ పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేసేవారిపై 6ఏ కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో వంట నూనె, టీ పొడి వంటి ఆహార పదార్థాల కల్తీలపై పాత్రికేయులు అడిగిన ప్రశ్నలపై మంత్రి స్పందిస్తూ ఇప్పటికే విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలలో ఆహార పదార్థాలు కల్తీలపై దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 59 ఫుడ్ ఇన్స్పెక్టర్ పోస్టులను భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కేంద్రాలకు వ్యయప్రయాసలతో రానవసరం లేకుండా జిలాల్లో నియోజకవర్గాల స్థాయిలో సదరం క్యాంపులు నిర్వహించి విభిన్న ప్రతిభావంతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ పెన్షన్లు, ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, సొంగ రోషన్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు, డా.కామినేని శ్రీనివాస్,చిర్రి బాలరాజు, మద్దిపాటి వెంకటరాజు, రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్ మందలపు రవి, వడ్డీలు కార్పొరేషన్ చైర్ పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి, ప్రభృతులు పాల్గొన్నారు.

## నేడు 'దివ్యాంగ శక్తి' ఉచిత బస్సు పథకం ప్రారంభం

మొదటిపేజి తరువాయి

దివ్యాంగులను ఎక్కించి ప్రయాణం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఒక బస్సులో జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రయాణిస్తూ కలెక్టరేట్ వరకు వెళ్లగా, మరో బస్సులో స్థానిక శాసనసభ్యులు ప్రయాణించి తమ నివాస ప్రాంతం వరకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారికంగా పథకాన్ని ప్రారంభించి మొదటి టికెట్ జారీ చేసిన అనంతరం మాత్రమే జిల్లాలో కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించాలని పేర్కొన్నారు. కార్యక్రమం ఉదయం 11 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. దివ్యాంగులు ప్రయాణించే బస్సులను పూలు, అరటి తొరణాలతో అందంగా అలంకరించాలని సూచించారు. శాసనసభ్యులతో పాటు పార్టీ ప్రతినిధులు కూడా ఈ ప్రయాణంలో పాల్గొనేందున వారికి కూడా తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలోని దివ్యాంగుల సంఘాల సహకారంతో దివ్యాంగులను ఒకేచోటకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని, కార్యక్రమం విజయవంతానికి అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎస్.గిరిధర్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఎం.రామ్నాథ్ రెడ్డి, ఆర్డీవోలు కే.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన మున్సిపల్ సర్వేయర్ రౌతు రామకృష్ణ

మొదటిపేజి తరువాయి

అధికారులువిచారిస్తున్నారు. ఈ తరుణంలో పలువురు పురపాలక సంఘ అధికారులు గైర్హాజరైనట్టు సమాచారం. మున్సిపల్ సర్వేయర్, ఇన్‌ఛార్జ్ డివిజనల్ సర్వేయర్‌గా పనిచేస్తున్న రామకృష్ణపై ఇప్పటికే పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయని, మంగళవారం ఆధారాలతో అవి వెలుగు చూసినట్లు ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలుస్తుంది.

# కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వైసీపీ గర్జన

మొదటిపేజి తరువాయి

చైర్మన్ పదవిలో ఉన్న బి.ఆర్.నాయుడు చేస్తున్న తప్పులను కప్పిపుచ్చుతూ, ప్రభుత్వం అతనికి వత్తాసు పలకడం సిగ్గుచేటని విమర్శించారు. ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించి,కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. రాజ్యాంగ విలువలని కాపాడాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి నిరసన తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుండి ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ ముఖ్య నేతలు,అనుబంధ విభాగాల అధ్యక్షులు ,వేల సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వైసీపీ నేతలు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# జిఎస్‌టి,ఇతర పన్నుల వసూళ్లు సమర్థవంతంగా నిర్వహించాలి



**– అధికారులకు జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశం**

**భీమవరం,మేజర్ న్యూస్:** నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన జీఎస్టీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. వాణిజ్య పన్నుల శాఖతో పాటు ఆదాయ ఆర్జనకు సంబంధించిన రెవెన్యూ, రవాణా, పంచాయతీరాజ్, విద్య, ఇరిగేషన్, హౌసింగ్, ఇండస్ట్రీస్ తదితర శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో వాణిజ్య పన్నుల వసూళ్ల పురోగతిపై సమగ్ర సమీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయాన్ని పెంపొందించడంలో ప్రతి శాఖ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో జరిగే ఆస్తులు, భూముల కొనుగోలు–అమ్మకాల వివరాలను సమయానికి వాణిజ్య పన్నుల శాఖకు అందజేయాలని ఆదేశించారు. ఈ లావాదేవీలకు సంబంధించిన పన్నులు తప్పనిసరిగా వసూలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట సంబంధిత వ్యక్తుల బ్యాంకు ఖాతా వివరాలను అందజేసి పన్ను వసూళ్లను మరింత సమర్థవంతంగా చేయాలని పేర్కొన్నారు. పట్టణాలు ,గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు తప్పనిసరిగా జీఎస్టీ చెల్లించాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్ల వివరాలు, వారి పనుల వివరాలు, పన్ను చెల్లింపుల స్థితిగతులను క్రమం తప్పకుండా వాణిజ్య పన్నుల శాఖకు తెలియజేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో వృత్తి పన్ను సక్రమంగా వసూలు చేస్తున్నారా లేదా అనే అంశంపై సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాణిజ్య పన్నుల వసూళ్లలో ఎలాంటి లోపాలు లేకుండా శాఖల మధ్య సమన్వయం బలోపేతం చేయాలని, సమాచారాన్ని సమయానికి పంచుకోవడం ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పూర్తిగా వసూలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి,వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కె.పి. శైలజశ్రీ, పాలకొల్లు, తణుకు అసిస్టెంట్ కమిషనర్లు డి.సాంబశివరావు,శ్రీనివాసరావు,జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఏ.వరప్రసాద్, గృహ నిర్మాణ శాఖ అధికారి జి. పిచ్చయ్య, పంచాయతీరాజ్, రవాణా, టిడ్కో, కార్మిక శాఖ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైయస్‌పాలెం సర్పంచ్ దంపతులకు సత్కారం



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్ :** మండలంలోని యర్రం శెట్టి పాలెం గ్రామ సర్పంచ్ య ర్రం శెట్టి నాగ ముత్యమాంబ బాబులు దంపతులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. వచ్చేనెల రెండుతో పదవీకాలం పూర్తి అవుతున్న సందర్భంగా గ్రామంలో మౌలిక వసతుల కల్పనలో వీరు చేసిన కృషికి గుర్తుగా ఘనంగా సత్కరించారు. గ్రామపంచాయతీలో సచివాలయం,రైతు భరోసా కేంద్రం,వెల్నెస్ సెంటర్,హై స్కూల్ తరగతులు అభివృద్ధి, హోమియోపతి హాస్పటల్ బిల్డింగ్ నిర్మాణం,స్మశాన వాటిక అభివృద్ధి తదితర అవసరమైన పనులు వీరి పాలనలో జరిగిందని ఈ సందర్భంగా పలువురు ప్రశంసించారు.పంచాయతీలో 8 ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు,జల జీవన్ మెషిన్ తో 60 లక్షలతో ఏడు కిలోమీటర్లు పైపులైను తదితర పనులు చేపట్టారు. ఎన్ఆర్ఈజీసీ నిధుల నుండి సిమెంట్ రోడ్లు నిర్మాణం గ్రామంలో సుమారు మూడు కిలోమీటర్లు రోడ్లకి ఆక్రమణ తొలగించడం, నూతన పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేశారని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ పాలకవర్గాన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుబ్బల వెంకటేశ్వరరావు,పిట్ట రామారావు,తలనశెట్టి శ్రీదేవి వాసు, గ్రంధి జగపతితో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్యాస్ గోడౌన్లను తనిఖీ చేసిన ఆర్డీవో దాసిరాజు




**నరసాపురం,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి,జెసి రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని గ్యాస్ గోడౌన్లను ఆర్డీవో దాసిరాజు మంగళవారం తనిఖీ చేశారు. భారత్ గ్యాస్, హెచ్.పీ గ్యాస్ స్టాక్ పాయింట్లు గోడౌన్లను తనిఖీ చేసి ఈరోజు వచ్చిన లారీలలో ఎన్ని సిలిండర్లు వచ్చినాయి. క్లోజింగ్ బ్యాలెన్స్ ఎన్ని ఉన్నాయి ఈరోజు ఎంతమంది వినియోగదారులకు గ్యాస్ పంపిణీ సంబంధించిన రసీదు లను పరిశీలించి స్టాకు రిజిస్టర్లను గ్యాస్ గోడౌన్లో ఉండవలసిన వాటికంటే హెచ్చుతగ్గులను ఉన్నాయా అనే కోణంలో పరిశీలించారు. సంబంధిత గ్యాస్ కంపెనీ వారికి సేల్స్ బాయ్స్‌కి కూడా ప్రస్తుత పరిస్థితులను అనుసరించి ప్రజలకు ఏ విధమైన అసౌకర్యము లేకుండా గ్యాస్ పంపిణీ పారదర్శకంగా అందించాలని మీపైన ఏ విధమైన ఫిర్యాదులు వచ్చిన తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు. సరఫరాకు సంబంధించి టీముల ను వేసాం ప్రతి గ్యాస్ కంపెనీకి ఒక అధికారిని నియమించడం జరిగిందని ఆర్డీవో తెలిపారు. ఎవరికైనా గ్యాస్ విషయంలో ఇబ్బందులు ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్ 8121676653 కి ఫోన్ చేయాలని ఆయన తెలిపారు.ఆర్డిఓ వెంట తాసిల్దార్ ఐ వి వి సత్యనారాయణ రెవిన్యూ అధికారులు ఉన్నారు.

# దత్తత తీసుకున్న పిల్లలను కన్నబిడ్డల్లా ప్రేమతో పెంచాలి



**– వారికి మంచి విద్య,ఉన్నత భవిష్యత్తు కల్పించాలి : జిల్లా కలెక్టర్ నాగరాణి**

**భీమవరం,మేజర్ న్యూస్ :** స్థానిక కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆడపాప దత్తత ప్రక్రియను పూర్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో శిశు గృహం స్థాపన అనంతరం మొట్ట మొదటిసారిగా ఒక ఆడ శిశువును జిల్లాలోని ప్రత్యేక దత్తత విభాగం ఆధ్వర్యంలో చట్టబద్ధంగా దత్తత ఇవ్వడం జరిగిందన్నారు.జిల్లా శిశు గృహంలో ఆశ్రయం పొందుతున్న 6 నెలల వయస్సు గల "సుమ" అనే ఆడపాపను కర్ణాటక రాష్ట్రానికి చెందిన శివానంద, మానస దంపతులు దత్తతగా స్వీకరించడం జరిగిందన్నారు. ఈ దంపతులు 2022 సంవత్సరంలో సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ పోర్టల్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 2026 మార్చి నెలలో వారికి దత్తత అవకాశం లభించిందన్నారు. దత్తత తీసుకున్న పిల్లలను కన్నబిడ్డల మాదిరిగా ప్రేమతో పెంచి, వారికి మంచి విద్యతో పాటు ఉన్నత భవిష్యత్తు కల్పించాలని సూచించారు. పిల్లలు లేని దంపతులు దేశవ్యాప్తంగా పోర్టల్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకుని చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.ఇటీవల చట్టవ్యతిరేకంగా పిల్లలను కొనుగోలు చేయడం, అమ్ముకోవడం వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి సంఘటనలు ఎక్కడైనా వెలుగులోకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టబద్ధమైన దత్తతను ప్రోత్సహించాలని తెలిపారు. దత్తత అనంతరం పిల్లల యోగక్షేమాలను తెలుసుకోవడానికి పోస్ట్ అడాప్షన్ ఫాలోఅప్ ప్రక్రియ అమలు చేయబడు తోందని, ఫాలోఅప్ నివేదికలను సంబంధిత పోర్టల్‌లో అప్లోడ్ చేస్తున్నామని వివరించారు. ఇద్దరూ ఉద్యోగాలలో ఉన్న ఈ దంపతులు, పాపను దత్తతగా పొందడం పట్ల ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.శ్రీ లక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్, శిశు గృహ మేనేజర్ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి



**పెంటపాడు,మేజర్‌న్యూస్;** కాగులంపాడు మండల ప్రజాపరిషత్ పాఠశాలలో మంగళవారం ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీనిర్వహించారు.మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో సంభాషించారు. భోజనాల్లోనాణ్యత, పరిశుభ్రత, పాఠశాలలో మౌలిక సౌకర్యాలు,విద్యాబోధన,తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించడానికి ఉపాధ్యాయులు,సిబ్బంది కృషి చేయాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంపన నరసింహ రాజు, అంగన్వాడి సూపర్వైజర్ చెరుకూరి భవాని పుల్లా బాబి, చెరుకూరి చంద్రశేఖర్, అమెరికా రాజు, తదితరులు పాల్గొన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

# విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు





**– మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విద్యా వ్యవస్థ బలోపేతం**

**– బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఆరిమిల్లి**

**తణుకు,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం పలు సంస్కరణలు చేపడుతోందని రాష్ట్ర పిఏసి కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం తణుకు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలను పరిశీలించిన ఎమ్మెల్యే, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సదుపాయం,తరగతి గదుల పరిస్థితి వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ, విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య రెండూ సమానంగా ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్ర విద్యా వ్యవస్థను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపే దిశగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాధాకృష్ణ హామీ ఇచ్చారు.

# స్వర్ణాంధ్రలో ఆటో ఎక్స్‌పోతో జాతీయ స్థాయి హ్యాకథాన్ ప్రారంభం



**నరసాపురంరూరల్, మేజర్ న్యూస్ :** మండలంలోని సీతారామపురం లో గల స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ మెకానికల్ ఇంజినీరింగ్, రోబోటిక్స్ విభాగాల ఆధ్వర్యంలో, ప్రపంచ ప్రఖ్యాత ఇంజినీరింగ్ సంస్థ అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ మద్దతుతో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి హ్యాకథాన్ మంగళవారం వివిధ రకాల కస్టమైజ్డ్ వాహనాల ఆటో ఎక్స్‌పోతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.వి.సత్యనారాయణ, ట్రెజరర్ కె. వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, యాజమాన్య సభ్యులు టి.వి.వి.ప్రసాద్, ఎస్. కీర్తి కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.ఎ.గోపిచంద్, ఏఐఎంఎల్ విభాగాధిపతి డా.బొమ్మ రామకృష్ణ, మెకానికల్ విభాగాధిపతి డా.ఫ్రాన్సిస్ లూథర్ కింగ్, కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలిచైర్మన్ ప్రొఫెసర్ కె. మధు మూర్తి, ఎస్. గణేష్ ( ఏఎస్ఎంఈ ఆసియన్ హెడ్), డా. అనిల్ కుమార్ ( ఏపీ ఎస్ సి హెచ్ ఈ ప్రిన్సిపాల్) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏఎస్ ఎం ఈ ప్రతినిధులు జి. నందగోపాల్ (మెంటర్), ఎల్. అశ్వాత్ (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్), డా. సుశాంత్ కుమార్ సాహూ (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్), డా. వి. శివరామన్ (ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్) ఈ హ్యాకథాన్ నిర్వహణలో పాల్గొంటున్నారు. ఈ హ్యాకథాన్ నిర్వహణలో ఏఐఎంఎల్ విభాగాధిపతి డా.బొమ్మ రామకృష్ణ, డా. ఫ్రాన్సిస్ లూథర్ కింగ్ ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సమన్వయకర్తలుగా డా. రావి లలిత నారాయణ, డా. జి. సుధాకర్, డా. పి.ఎస్.ఎన్. రాజు, ఆర్.వి. మణికంఠతో పాటు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమ నిర్వహణలో పాల్గొంటున్నారు. ఈ హ్యాకథాన్ బుధవారం కూడా కొనసాగనుంది. 186 బ్యాచ్లు రిజిస్టర్ చేసుకోగా 40 బ్యాచులు ఫైనల్ కు ఎంపికయ్యాయి. బుధవారం విజేతలకు బహుమతులు అందజేయబడతాయని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు.

24 గంటల పాటు సుదీర్ఘంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్లో మొదటిసారిగా స్వర్ణాంధ్ర విద్యాసంస్థలకు దక్కింది. ఎంపికైన 40 బ్యాచ్లలో స్వర్ణాంధ్ర విద్యాసంస్థల కు చెందిన 12 బ్యాచ్లు ఎంపిక కావడం విశేషం. విద్యార్థులు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని కోశాధికారి కొండవీటి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి జండా ఊపి ప్రారంభించారు.

# జిల్లాలో అభివృద్ధి - సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష





**– హాజరైన జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల ,కలెక్టర్,ఎమ్మెల్యేలు**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ,జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్,అధికారులతో జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి బాటలో నిలిపేందుకు అవసరమైన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై చర్చించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోనికి మరింత సమర్థవంతంగా తీసుకువెళ్లేందుకు తీసుకోవలసిన చర్యలు, ప్రభుత్వ సేవలపట్ల ప్రజలకు మరింత మేలు జరిగేలా, ప్రజల సంతృప్తిస్థాయి మరింత పెంచేందుకు తీసుకోవలసిన చర్యలు, జిల్లాలో పాపికొండలు ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి, ముఖ్యంగా టెంపుల్ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు, జిలాల్లో ప్రజల సంతృప్తి స్థాయి తక్కువగా ఉన్న ప్రభుత్వ సేవల విభాగంలో ప్రజల సంతృప్తి స్థాయిని మరింత పెంచడంపై తీసుకోవలసిన చర్యలు, రైతాంగానికి అవసరమైన సాగునీటికి సంబంధించి పంట కాల్వలు మరమ్మత్తులు, తదితర అంశాలపై ఎమ్మెల్యేలు,అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేనిప్రభాకర్, సొంగ రోషన్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు,డా.కామినేని శ్రీనివాస్,చిర్రి బాలరాజు, మద్దిపాటి వెంకటరాజు, రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్ మందలపు రవి,జాయింట్ కలెక్టర్ డా.ఎం.జెఅభిషేక్ గౌడ, ప్రభుతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌కు విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్ కు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పూలమొక్కను అందించి స్వాగతం పలికారు.

# తాగునీటి ఇబ్బందులు లేకుం చర్యలు తీసుకోవాలి





**భీమడోలు,మేజర్ న్యూస్ :** రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని భీమడోలు మండల పరిధిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, తగు ప్రణాళికలను రూపొందించాలని, భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు కనమాల రామయ్య(ఆదాం) కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షుల అధ్యక్షతన జరిగింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతి దేవి కార్యక్రమ నిర్వహణలో సహకరించారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల కాలంలో మండల పరిషత్ కార్యాలయంలో నాలుగవ సిబ్బంది గా పనిచేస్తూ, ఉద్యోగోన్నతి దెందులూరు మండలానికి బదిలీ పై వెళ్ళి అనారోగ్య కారణాలతో చనిపోయిన ఉద్యోగి రమణ మృతికి సంతాప సూచికంగా రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులను సమర్పించారు. కార్యక్రమం చివరిలో ప్రస్తుత మండల పరిషత్ పదవీకాలంలో నిర్వహించిన మండల పరిషత్ సమావేశాలకు సర్పంచ్ హోదాలో చివరిసారిగా హాజరైన సర్పంచులను మండల పరిషత్ అధ్యక్షులతో పాటు,మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల రెవెన్యూ అధికారి బి.రమాదేవి, మండల పరిషత్ పాలకవర్గం సత్కరించారు. సమావేశంలో పాల్గొన్న మండల పరిషత్ అధ్యక్షులు మాట్లాడుతూ వేసవిలో తాగునీటితోపాటు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సాగు,తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవలసిన ఇరిగేషన్,ఇతర అధికారులు గైర్హాజరు కావడం, వారి స్థానంలో ఉద్యోగ విరమణ చేసిన కింద స్థాయి తాత్కాలిక సిబ్బంది హాజరు కావడం పట్ల సమావేశం నిరసన తెలిపింది. సామాజిక భద్రత పెన్షన్లు పంపిణీ చేసే సమయంలో వారి నుంచి పంచాయతీ పన్నుల వసూలుకు ఒత్తడి చేయటం సరికాదన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శర్మ పాల్గొన్నారు.

## ఏలూరులో జనసేనలో 8వేల సభ్యత్వాలు నమోదు : అప్పల నాయుడు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ క్రియాశీలక ఉద్యమి సభ్యత్వ నమోదు చురుకుగా జరిగిందని ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి రెడ్డి అప్పల నాయుడు తెలిపారు. 5వ విడత క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమంలో భాగంగా ఏలూరులో ఇప్పటికే 8000 వేలకు పైగా సభ్యత్వాలు నమోదయ్యాయని పేర్కొన్న ఆయన మిగిలిన ఈ ఒక్క రోజు కూడా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ఏలూరు నియోజక వర్గంలో ప్రతి ఒక్క జన సైనికుడు,వీర మహిళలు పార్టీ పొడిగించిన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. పదో తారీకుతో ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగిసినప్పటికీ క్షేత్రస్థాయిలో జనసేన పార్టీ నాయకుల నుండి వచ్చిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో జనసేన సభ్యత్వాలను పెంచడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయవచ్చని ఆయన తెలిపారు.

# రైలు ఢీ కొని గుర్తు తెలియని ఇద్దరు యువకులు మృతి





**పెదపాడు,మేజర్ న్యూస్ :** రైలు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందిన ఘటన ఏలూరు రైల్వే పోలీసుల పరిధిలో చోటుచేసుకుంది. వట్లూరు – నూజివీడు రైల్వే ట్రాక్ మార్గంలో రైలు ఢీకొన్నట్లు గుర్తించారు. మృతుని ఎత్తు 5.5, కోల ముఖము,చామన చాయ,బ్లాక్ కలర్ జీన్స్ ప్యాంటు, జంగిల్ కలర్ టీ షర్టు ఆలూ గ్రీన్ టీ షర్టు ధరించి ఉన్నాడు. అదేవిధంగా బీహార్ రాష్టానికి చెందిన మరో వ్యక్తి బొమ్ములూరు గేట్ సమీపంలో రైలు ఢీ కొని మృతి చెందాడు. మృతుడు మతి స్థిమితం కోల్పోయి సమీపంలో తిరిగేవాడని పోలీసులు గుర్తించారు. వట్లూరు స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఏలూరు రైల్వే ఎస్సై దానం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జాగృతి పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




**కైకలూరు, మేజర్ న్యూస్,** గ్రాడ్యుయేషన్ డే ( పట్టభద్రుల దినోత్సవం) అనేది చిన్న పిల్లలు ప్రీ స్కూల్ నుండి ప్రైమరీ స్కూల్‌కు మారే అపురూపమైన వేడుక ఇది వారి మొదట విజయాన్ని నేర్చుకుని, నైపుణ్యాలను నవ్వులను సంబరంగా జరుపుకునే రోజు. ఈ రోజున పిల్లలు గ్రాడ్యుయేషన్ గౌన్లు క్యాపులు ధరించి, సర్టిఫికెట్స్ అందుకుంటూ ప్రదర్శనలు ఇస్తూ తల్లిదండ్రుల సమక్షంలో సంతోషంగా గడుపుతారు. పిల్లలు ప్రతిభను ప్రోత్సహించడానికి జాగృతి పాఠశాలలో ఈ గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పానేశీ జయ కిషోర్ బాబు సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం ద్వారా వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు,పాఠశాల సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

# మూడు నెలల్లో లబ్ధిదారులకు టీడ్కో గ్రహాలు





**– ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడి**

**ఏలూరు, మేజర్ న్యూస్ :** గత వైసిపి ప్రభుత్వ విధ్వంసకర పాలనలో తీవ్రంగా నష్టపోయిన టిడ్కో గృహాల లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో న్యాయం చేస్తుందని, వచ్చే జూన్ నెలాఖరికి టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి భరోసా ఇచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు మేలు చేయలేని వారికి ఇప్పుడు మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పోణంగి రోడ్‌లో నిర్మిస్తున్న టిడ్కో గృహాలను శరవేగంగా పూర్తి చేయించి లబ్ధిదారులకు అందించి వారి కళల్లో ఆనందాన్ని చూడాలని తాపత్రయ పడుతున్నారు.

దీనిలో భాగంగానే టిడ్కో గృహాల పనులను పరుగులు పెట్టేలా అధికారులకు పలు సూచనలు చేస్తూ వస్తున్నారు. మంగళవారం స్వయంగా ఎమ్మెల్యే బడేటి చంటి పోణంగి రోడ్డులోని టిడ్కో గృహాలను పరిశీలించారు. పనుల వివరాలను అధికా రులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చంటి మీడియాతో మాట్లాడుతూ 2014–19 మధ్యకాలంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రభు త్వం పేద ప్రజలు సుఖశాంతులతో జీవించడానికి నాణ్యమైన గృహాలను అందించాలని నిర్ణయించి పోణంగి, కొత్తూరు, మాదేపల్లిలో దాదాపు 6486 టిడ్కో గృహాలకు శంకుస్థాపన చేసిందని తెలిపారు. ఈ గృహాల నిర్మాణం పురోగతిలో ఉండగా ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలను నిర్వీర్యం చేసే విధంగా చర్యలు తీసుకుందని ధ్వజమెత్తారు. కేవలం విధ్వంసం తప్ప ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తి చేయకపోగా చివరకు లబ్ధిదారులను కూడా మోసం చేశారని ఆరోపించారు. ఈ ఇళ్లను కూడా తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని లబ్ధిదారులను నిలువు దోపిడీ చేశారని ధ్వజమెత్తారు. డీడీలు కట్టిన పాపానికి లబ్ధిదారులు బ్యాంకు నోటీసులు అందుకోవాల్సిన పరిస్థితితోపాటు సిబిల్ స్కోర్ పడిపోయి వారికి మళ్ళీ రుణాలు వచ్చే అవకాశం లేకుండా పోయిందని ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. వచ్చే నెల ఏప్రిల్‌లో డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికి ఆ మొత్తాన్ని తిరిగి వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా పోణంగి, కొత్తూరులో నిర్మిస్తున్న టిడ్కో గృహాలను జూన్ నెలకి లబ్ధిదారులకు అందించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి విజయవాడ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, బిజెపి జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్,డిప్యూటీ మేయర్ కర్రి శ్రీనివాస్,కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, నగర ప్రధాన కార్యదర్శి రెడ్డి నాగరాజు, క్లస్టర్ ఇంచార్జ్ పైడి వెంకట్రావు,కో క్లస్టర్ ఇంచార్జ్ మెరుగుమాల శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు గొంగాడి సాంబశివరావు, తెర్లి వెంకన్న,ఆర్నేపల్లి తిరుపతి, పూజారి నిరంజన్,పిఎన్ఆర్ నాగేశ్వర రావు, టిడ్కో గృహాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణరావు,ప్రాజెక్టు మేనేజర్ కృష్ణమూర్తి, ఏఈలు పూర్ణచంద్ర కుమార్,సాయిబాబా,బిజెపి నాయకులు నడపన భాస్కరరావు,జనసేన నాయకులు వీరంకిపండు, వివిధ హోదాలలో ఉన్న కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు లాభసాటి వ్యవసాయం కోసమే పంచ సూత్రాలు

ఇరగవరం,మేజర్ న్యూస్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు లాభసాటి వ్యవసాయం కల్పించాలనే ఉద్దేశంతో పంచ సూత్రాలు ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. మంగళవారం ఇరగవరం మండలం కావలిపురం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత పట్ల రైతులు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా కావలిపురం గ్రామంలో దాదాపు 300 మంది రైతులకు రూ. 77 లక్షలు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. తణుకు నియోజవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 16500 మంది రైతులకు రూ. 10 కోట్లు వారి ఖాతాలో ఇప్పటికే జమ చేసినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధాన్యం కొనుగోలు విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో రైతులు తమ ధాన్యాన్ని



ఎక్కడ విక్రయించుకోవాలో తెలియని పరిస్థితి ఉండేదని ప్రస్తుతం రైతులు తమకు నచ్చిన చోట అమ్ముకునే విధంగా వెసులుబాటు కల్పించామన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో నిర్మించిన రోడ్లు ఎమ్మెల్యే రాధాకృష్ణ ప్రారంభించారు.

# రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి : రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బొరగం



కొయ్యలగూడెం రూరల్,మేజర్‌న్యూస్ : రైతు శ్రమ దళారుల చేతికి పోకుండా ప్రభుత్వం ప్రత్యన్నాయ మార్గం ద్వారా రైతు పండించిన పంటకు లాభసాటి గా మారుస్తూ ప్రతి రైతు ఆర్థిక అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామంలో 'రైతన్న'– మీకోసం –కార్యక్రమాన్ని రైతు సోదరులతో కలిసి ఘనంగా నిర్వహించారు. రైతుల ఇంటి వద్దకి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న పలు సేవ కేంద్రాల ద్వారా రైతు సంక్షేమం కార్యక్రమాలను వివరిస్తూ రైతు క్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాలను వివరించడంతో పాటు స్వయంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ పొట్ట రామారావు, మండల పార్టీ అధ్యక్షులుడమాజీ ఏఎంసి చైర్మన్ పారెపల్లి రామారావు,రాష్ట్ర డైరెక్టర్ పెండ్యాల రమాదేవి,సొసైటీ అధ్యక్షులు యానమదల మాధురి ప్రసాద్, మండలం ప్రధాన కార్యదర్శి చిటికిన గంగాధర్,జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల అరుణ,జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ జారం చాందిని,గ్రామ కమిటీ అధ్యక్షులు తోట వీరబాబు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పారెపల్లి నరేష్,అగ్రికల్చర్‌పోసిరావు, అగ్రికల్చర్ విలేజ్ సెక్రటరీ రాయల సత్యనారాయణ,జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ,కాకర్ల శేషు,మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు ఠాఖ సిద్దు, ఆకుమర్తి సురేష్,గెడ నాగబాబు,జనసేన నాయకులు సాయి, బీజేపీ నాయకులు నంది,గెడ రామయ్య,మండల మాజీ ప్రధాన కార్యదర్శి బొబ్బర చిన్న రాజు, టౌన్ పార్టీ అధ్యక్షులు ఆరేటి వీరపండు,గంగుల నాగు, గుది వెంకటేష్, గన్నామని దిరాజ్,నిమ్ము జగదీశ్, పసుమర్తి భీమేశ్వరావు,జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ మనెల్లి బాలు గార్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజన్సీ గోడౌన్ తనిఖీ చేసిన తహసీల్దార్



**పోదూరు,మేజర్ న్యూస్ :** పోడూరు గ్రామంలోని శ్రీ సీతారామ ఎంటర్ప్రైసర్స్ గ్యాస్ ఏజెన్సీ గుడామ్ ను తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ మంగళవారం తనిఖీ చేశారు .ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 48 గ్యాస్ సిలిండర్ల ప్రారంభ నిలవతో మంగళవారం 342 సిలిండర్లు లోడ్ వచ్చి మొత్తం 390 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల పదవ తారీకు వరకు బుక్ చేసుకున్న వారికి వారి ఓటీపీని తీసుకుని సిలిండర్ల232 సిలిండర్లు డెలివరీ చేసి ఉన్నారని, ప్రస్తుతానికి ఎటువంటి గ్యాస్ కొరతా లేదని తెలిపారు. 50 మంది గ్యాస్ పొందిన వినియోగదారులతో ఫోన్లో మాట్లాడగా, డెలివరీ బాయ్స్ ఎటువంటి అధిక సొమ్ము డిమాండ్ చేసి ఉండలేదని వారు తెలిపినట్లు చెప్పారు. గ్యాస్ సకాలంలో అందినందున వారి సంతృప్తిని తెలియపరచి నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీలో రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## వన్ స్టాప్ సెంటర్‌లో పని చేయుటకు మహిళా అభ్యర్థులు కావలెను

**– జిల్లా మహిళా ,శిశు సంక్షేమ అధికాణిని డి.శ్రీలక్ష్మి**



**భీమవరం,మేజర్ న్యూస్ :** జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తణుకు పట్టణంలో వన్ స్టాప్ సెంటర్‌ను నూతనంగా ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా మహిళా,శిశు సంక్షేమ అధికాణిని డి.శ్రీలక్ష్మి తెలిపారు. ఈ సెంటర్ నందు వివిధ పోస్టులలో కాంటాక్ట్ పద్ధతిపై పనిచేయుటకు మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది అన్నారు. వీటిలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ - 1 పోస్ట్, కేసు వర్కర్–1, పారా లీగల్ పర్సనల్ / లాయర్ –1, పారా మెడికల్ పర్సనల్–1, సైకో సోషల్ కౌన్సెలర్ –1,కంప్యూటరు పరిజ్ఞానం ఉన్న ఆఫీసు అసిస్టెంట్ –1,సెక్యూరిటీగార్డ్/ నైట్ గార్డ్–1 పోస్టు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు westgodavari.ap.gov.in వెబ్సైట్ నందు దరఖాస్తులను డౌన్ లోడ్ చేసుకొని పూర్తి చేసి అన్ని ధృవీకరణ పత్రాల నకళ్ళను అటెస్టేషన్ చేయించి భీమవరం కలెక్టరేట్ కాంపౌండ్‌లో ఉన్న జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి వారి కార్యాలయం నందు మార్చి 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని తెలిపారు.

## ఫర్నిచర్ సమకూర్చిన పిప్పర జెడ్‌పి పూర్వ విద్యార్థులకు ప్రశంసలు



**భీమడోలు,మేజర్ న్యూస్:** పిప్పర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి అవసరమైన ఫర్నిచర్ సమకూర్చటం అభినందనీయమని, పాఠశాల ప్రధానో పాధ్యాయులు పి.జె.వెంకటేశ్వర్లు, బుచ్చి మాస్టారు తెలిపారు. పాఠశాలలో ఇటీవల నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 1976–77 విద్యా సంవత్సరపు పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు ఫర్నిచర్ కొరత ఉన్న విషయం వారి దృష్టికి వచ్చింది.

దీనిపై స్పందించిన పూర్వ విద్యార్థుల్లోని ప్రముఖులు దాట్ల సుబ్బరాజు, ఇందుకూరి సూరపరాజు, దాట్ల సత్యనారాయణ రాజు, వి శ్రీనివాసరాజు, పి గోవింద్ ఇతర పూర్వ విద్యార్థులతో చర్చించారు. దీనిపై వారందరూ స్పందించారు. రూ. 60వేల విలువ గల 10 తరగతి గదులు టేబుళ్ళను సమకూర్చారు. మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల్లోని ప్రముఖులు వాటిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బుచ్చి మాస్టారుకు అందజేశారు. పూర్వ విద్యార్థుల వితరణను పలువురు కొనియాడారు.

# ప్రతిరోజూ ప్రజావేదిక నిర్వహిస్తాం : ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్;** ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించేందుకు, ఇకనుంచి ప్రతిరోజు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహిస్తామని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలియజేశారు. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు,సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని, వీటి ఫలితాలు పూర్తిగా ప్రజలకు అందే విధంగా ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు.ప్రజాసమస్యల పరిష్కారానికి నెలల తరబడి వేచి ఉండే పరిస్థితి గతంలో ఉండేదని, అలాంటి పరిస్థితులు లేకుండా సత్వరమే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా అన్ని గ్రామాలలో పల్లె పండుగ నిర్వహించామని అన్నారు. రూ.14కోట్లతో గ్రామీణ రహదారులను,రూ.15కోట్లతో రోడ్లు, భవనాల శాఖ రహదారులను నిర్మించామని తెలిపారు.రూ.8.5కోట్లతో వీరంపాలెం వద్ద వంతెన నిర్మిస్తున్నామని చెప్పారు. గూడెం పట్టణంలో స్వర్గీయ ఈలి ఆంజనేయులు హయాంలో 20ఎకరాలలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని రూ.70కోట్లతో 53ఎకరాలకు విస్తరించి, వేసవిలో సైతం మంచినీటి కొరత లేకుండా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రూ.3.80 కోట్లతో ఈతకొలను నిర్మాణం , జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధి పనులను తన సొంత నిధులు, ప్రజల విరాళాలతో,పి4 విధానం లో పూర్తిచేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. బాదంపూడి నుంచి పత్తిపాడు వరకు దాదాపు 14 కిలోమీటర్ల ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి చేశామన్నారు. పాస్ బుక్కుల విషయం లో జగన్ తన ఫోటోతో వ్యక్తిగత ప్రచార యావతో రూ.900కోట్లు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని అన్నారు. తప్పుల తడకగా, అస్తవ్యస్తంగా సాగిన రీసర్వేను సరి చేశామన్నారు.

## ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుల రవాణాపై ఏఎస్పి సుస్మిత ఆకస్మిక తనిఖీలు



**జంగారెడ్డి గూడెం,మేజర్ న్యూస్ :** పట్టణంలో అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం నిఘాను ముమ్మరం చేసింది. ఏలూరు జిల్లా ఎస్.పి కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై ఏఎస్.పిసుస్మిత ఆర్ పట్టణంలోని పలు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇన్స్పెక్టర్ ఎం.వి. సుభాష్,ఎస్.ఐ వీర ప్రసాద్,సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్.పి సుస్మిత మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ యజమానులకు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ప్రతి ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో లోపల, వెలుపల తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. వీటి దృశ్యాలను కనీసం 30 రోజుల పాటు భద్ర పరచాలని, అనుమానాస్పదంగా ఉన్న పార్శిళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. వస్తువులను బుక్ చేసే వ్యక్తులు, స్వీకరించే వ్యక్తుల ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డుల నకలును తప్పనిసరిగా సేకరించాలన్నారు. ప్రతిరోజూ వచ్చే, వెళ్లే లోడ్ వివరాలను,వాహన నెంబర్‌లు , డ్రైవర్ల వివరాలను స్పష్టంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనుమానాస్పద వస్తువులనశాంతి భద్రతల పరిరక్షణ కోసం వ్యాపారస్తులు పోలీసులకు సహకరించాలని,నిరంతరం ఇటువంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

## వైసిపి నేత కృపా నాథ్‌కు సత్కారం



పాలకొల్లు , మేజర్ న్యూస్: స్థానిక 27వ వార్డు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీఇన్చార్జిగా పాలపర్తి కృపా నాథ్ నియమితులయ్యారు,వార్డు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు కృపనాథ్ కు శాలువా కప్పి సన్మానించినారు. కృపనాథ్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలియ చేశారు. ఈ నియామకానికి కారకులైన పాలకులు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ గుడాల శ్రీహరి గోపాల రావుకు,మాజీ డిసిఎంహెచ్ చైర్మన్ ఎడ్ల తాతాజీలకు కృతజ్ఞతలు తెలిపారు,కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం సెక్రెటరీ ఉనికిల శ్రీను వాస్.గ్రామ పెద్దలు బద్ద ఆనందరావు ,కలిగితి వరప్రసాద్ ,పి మాణిక్యం,ఎస్ వెంకటేశులు పి.బోసు బాబు.ఎం.సుధా బాబు ఎస్.పద్మా రావు ఏ.ప్రవీణ్ పి.ఏసోబు.పి.ప్రశాంత్ కె.సతీష్ డి.సందీప్ కే.చంటి తదితరులు పాల్గొన్నారు,

# ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి





**ఏలూరు,మేజర్ న్యూస్ :** అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ యువత తమ జీవితాలను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. అందుకు అవసరమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెండుగా కల్పించేందుకు కూటమి ప్రభుత్వాది నేతలు విశేషంగా కృషిచేస్తున్నారని ఆయన వెల్లడించారు.అశోక్ నగర్ కేపిడిటి హైస్కూల్ ఆడిటోరియంలో మంగళవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లోని 21 ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో అభ్యర్థుల ఎంపికలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఇచ్చిన హామీలో భాగంగా 20లక్షల మంది యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం శ్రమిస్తోందన్నారు. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ధ్యేయంతో ముందడుగు వేస్తున్నారన్నారు. జాబ్ మేళాల్లో ఉద్యోగాలు పొందినవారంతా ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎమ్మెల్యే చంటి ఆకాంక్షించారు. మొత్తం 14 96 ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తే 352 మంది తమ వివరాలు పోర్టర్లో నమోదు చేయించుకున్నారని, వారిలో 175 మందికి ఈరోజు ఉద్యోగ అవకాశాలు వచ్చాయని తెలిపారు.

అనంతరం ఆయన ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి కె.ప్రవీణ్,ఎఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి,టిడిపి నగర కార్యదర్శి రెడ్డి నాగరాజు,టిడిపి సీనియర్ నాయకులు బెల్లపుకొండ కిషోర్, లంకపల్లి మాణిక్యాలరావు, ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 23న విజయవాడలో జరిగే ధర్నా జయప్రదం చేయాలి



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఆందోళన చేయాలని ఐ ఎఫ్ టి యు జాతీయ కమిటీ పిలుపుమేరకు మార్చి 23 న విజయవాడలో జరుగు ధర్నా పోస్టర్లను మంగళవారం బోసు బొమ్మ సెంటర్లో విడుదల చేయడమైనది ఈ సందర్భంగా కెవి రమణ మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారని వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సర్దార్ భగత్ సింగ్ రాజు గురు సుఖదేవ్ లు అమరత్వం పొందిన మార్చి 23న విజయవాడ ధర్నా చౌక్ లో వేలాది మంది కార్మికులతో ధర్నా జరుగుతుందని అన్నారు నేడు కార్మిక వర్గం అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కోల్పోతుందని ఏప్రిల్ ఒకటి నుండి నాలుగు లేబర్ కోడ్లు అమలు చేయాలని కేంద్రం నిర్ణయించిందని ఇది దుర్మార్గమైన చర్య అని యాజమాన్యాలు కార్మికుల చేత రోజుకి 12 గంటలు పని చేయించే విధంగా ఆ చట్టం మార్పు చేశారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో గంపల శ్రీను ఉప్పాటి దాసు మద్దిపాటి సత్తయ్య కొత్తూరు నాగు వసంతాటి సత్య మద్దిపాటి గంగరాజు కొత్తూరు శ్రీను ముప్పిడి సత్యనారాయణ కొత్తూరు నాని లక్కవరపు రామయ్య ఉర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## ఇండెన్ గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసిన డిప్యూటీ తాసిల్దార్



**ద్వారకాతిరుమల మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర విశాల సహకార సంఘం చే నడుపబడుతున్న ఇండెన్ గ్యాస్ ఏజెన్సీని మంగళవారం సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ నాగరాజు తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్యాస్ నిల్వలు, బుకింగ్ వివరాలను, క్షుణ్ణంగా పరిశీలించారు. మంగళవారం దిగుమతి చేసుకున్న 342 గ్యాస్ సిలిండర్లను ముందుగా బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు అందజేశారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం గ్యాస్ కొరత లేదని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్యాస్ సిలిండర్ తీసుకున్న తర్వాత మరల 25 రోజులకి సిలిండర్ కోసం బుకింగ్ చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది ఉన్నారు

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** మండలంలోని ములగలంపల్లి గ్రామంలో రంజాన్ మాసం పురస్కరించుకొని మసీదులో ముస్లిం పెద్దలు నిర్వహించిన ఇఫ్తార్ విందులో పోల వరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం మసీదుకు చేరుకున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ముస్లిం పెద్దలు,ముస్లిం సోదరులు స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని,పరస్పర స్నేహభావాన్ని బలోపేతం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ రంజాన్ మాసం శాంతి, సహనం, పరస్పర గౌరవానికి ప్రతీక అని తెలిపారు.కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, గ్రామ సర్పంచ్ సరియం రాజు,సరియం ముత్యాలరావు, కొప్పుల శ్రీకాంత్,జిలుగుల శివ, సొంటి రామకృష్ణ, నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ చాప రవి,టీడీపీ సీనియర్ నాయకులు ఉండవల్లి సోమసుందరం, బాజీ, మరీదు పండు, ఆకి రెడ్డి ప్రసాద్, ఊడా కొండయ్య, మిడత నాగరాజు, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.